# ఢాటు పరువ

(కథానిక)

ఒక్క దినం ముత్యాలరావుకి బడిలో తన తరగతిలో ఒక కొత్త విద్యార్థి కన్పించాడు. ఆ వ్యక్తి యెవరో తెలుసుకొనటానికి ముత్యాలరావు కొంచెం సేపు ఆలోచన చేయవలసి వచ్చింది. ఆ కుర్రవాడి పేరు సత్యనారాయణ. వాడిది తన గ్రామం ప్రక్క గ్రామమే.

సత్యనారాయణకు, ప్రత్యేకంగా వెళ్లి సుమారు ఆరు మాసాల కాలం తాను ప్రయివేటు గూడా చెప్పాడు. ట్రైనింగు పరీక్ష ప్యాసయి వచ్చిన తర్వాత అందులో సంపాదించుకొన్న అనుభవం అంతా చేర్చి, ఆ కుర్రవాడికి పాఠాలు బోధించేవాడు ముత్యాలరావు. ప్రతి ప్రయివేటు మేష్టరు తీసుకొనే గంటన్నర కాలంగాక సుమారుగా రెండున్నర గంటల కాలం తీసుకొనేవాడు. అన్ని సబ్జక్టులూ చెప్పేవాడు! తనకు తాను బాగా చెబుతున్నాడా అని సంతృప్తి మాత్రం పొందుతూండేవాడు ముత్యాలరావు. ప్రతిదినం రెండున్నర గంటల చిల్లర పడ్డపాటు ఫలితంగా, నెలకు అయిదు రూపాయలే అతనికి ముట్టేవి. అవనా, సంతోషంగా "పుచ్చుకోండి" అని ఇచ్చేవారు కాదు!

"మాష్టారూ! మీరేం చెబుతున్నారో ఏమిటో తెలియకుండా ఉంది. కుర్రవాడొక్క అక్షరం చదవలేదు, ఒక్క లెక్క చెయ్యలేదు. కొంచెం శ్రద్ధగా చెబుతూండండి" అని అంటుండేవారు. ముత్యాలరావు అప్పటికి "సరే" ననేవాడు. ట్రైనింగు పరీక్ష ప్యాసయిన తర్వాత సుమారు సంవత్సరం వరకూ కాళీగానే ఉండవలసి వచ్చింది. అనవసరంగా కాళీగా ఉండటం ఎందుకనే ఉద్దేశ్యంతో యిలాంటి పద్ధతులు అలగయిదు ఒప్పుకొన్నాడు. రెండున్నర గంటల కాలం. బుర్రబద్దలు కొట్టుకొని చెబుతుండినా, డబ్బుయిచ్చే సమయంలో మాత్రం హార్కులు లేకుండా డబ్బు ఊడిపడేది కాదు! ఆ సమయంలో ముత్యాలరావు ఆత్మాభిమానం చంపుకొని వుండాలి. ఆ ఆత్మాభిమానమే వుంటే "నాకవసరంలేదు. మీరు మరొకరిచేత చెప్పించుకొనండి" అనివుండేవాడు. అతడు వాళ్ళకిచ్చిన జవాబు, "చిత్తం అలాశ్రద్ధగా చేయిస్తాను లెండి!" అని.

నాయుడుగారి అబ్బాయికి, అంటే సత్యనారాయణకు అతి జాగ్రత్తతో, ముత్యాలరావు చదువు చెబుతున్నప్పటికీ, ప్రయోజనం కల్గలేదు. రెవిన్యూ ఇన్స్పెక్టరు ఉద్యోగఫాయిలో ఉన్న నాయుడుగారు, తమ కుమారుడు సత్యనారాయణ చదువు విషయంలో అతిశ్రద్ధ తీసుకున్నారు. ముత్యాలరావు అసలు చదువే చెప్పలేదని కాబోలు ఆయన ఉద్దేశం. అవును చేదస్తంగా గంటలతరబడి కూర్చొని ప్రతి సబ్జక్టూ చెప్పే వ్యక్తులు ఆ విధంగానే కన్పిస్తారు! హైస్కూళ్ళలో చేర్చే అదను రావటంతోటే మరో హైస్కూలు మేష్టర్ని పిలిచి-కనీసం ముత్యాలరావుతో ఈ సంగతైనా చెప్పకుండా కుర్రవానికి ప్రయివేటు చెప్పించసాగాడు. ముత్యాలరావు సంగతి తెలిసిన తర్వాత, చాల బాధపడ్డాడు. నాలో యేమైనా లోటు వున్న పక్షంలో 'యిదీ లోటు' అని చెప్పాలిగాని అంత అగౌరవంగా మరో మాష్టార్ని కుదర్చకూడదండీ!" అన్నాడతను. వయసుకు చిన్నవాడయినా, ముత్యాలరావు మంచి భేషయిన మాట అన్నాడు.

రెవిన్యూనాయుడు తెలివి తక్కువగా ఊరుకొన్నాడా, "ఏమిటయ్యా! కబుర్లు చెబుతావ్, నీవు మూడు గంటలకాలం చెప్పే ప్రయివేటు, కొత్త మేష్టరు చెప్పే పది నిముషాల ప్రయివేటుకు సమానం. ఏమిటో కబుర్లు చెబుతావ్. వెళ్ళయ్యా వెళ్ళు" అని అన్నాడు. "వెళ్ళు" అని సంబోధన మారటంతోటే ముత్యాలరావు తగ్గిపోయాడు. ఆలాటి వ్యక్తులతో మాట్లాడ

ఓగేటి శివరామకృష్ణ

టం వల్ల కలిగేది తగు గౌరవం కాదని అతడు భావించాడు. సిగరెట్టు నోట పెట్టుకొని, సైకిలుమీద వేగంగా వచ్చి, జోడు చప్పుడు చేస్తూ కూర్చుని "ఇది చదువు అది చదువు!" అని చెప్పి గంట వాయించుకొంటూ వెళ్ళిపోయే మేస్టరూ; వ్యయ ప్రయాసలకూ, యితర విషయాలకూ ఓర్చి గంటల తరబడి చెప్పే తానూ సమానమా? ఎప్పుడూ సమానం కాదు. ఒక్కగా ఒక్కటి మాత్రం తేడాగా ఉంది. అదే-తాను మామూలు ప్రయివేటు మేస్టరూ - ఇప్పుడు చెబుతున్నాయన హైస్కూలు మేస్టరూ. తనద్వారా అయితే, చేర్చవలసిన తరగతికి కుర్రవాడు ఎలాగా సరిపోడు; క్రింది క్లాసులో వేయించాల్సి వస్తుంది. కొత్త మేస్టరుద్వారా అయితే మార్కులు వచ్చినా, రాకపోయినా సరకు ఉన్నా లేకపోయినా, కావలసిన క్లాసులో కూర్చోబెడుతాడు! ఇదీ వారిరువురి మధ్యా వత్యాసం!

ముత్యాలరావు మాటాడక యివతలికి వచ్చేశాడు. ముత్యాలరావుకు యిప్పుడు యీ ఉళ్ళో ఉద్యోగం అయింది. సత్యనారాయణ చెప్పాడు. తన తండ్రికి యీ ఊరే బదిలీ అయిందని. ముత్యాలరావు విని ఊరుకొన్నాడంతే!

మరునాడు, సత్యనారాయణ వచ్చి నాయుడుగారు ఒకమారు కన్పించాల్సిందని చెప్పారని చెప్పాడు. ముత్యాలరావు ఆలోచనలో పడ్డాడు.

"ఎందుకూ ఏంపని?"—అని ప్రశ్నించాడతను.

"నాకు తెలియదండీ, తప్పక రమ్మన్నారండీ!"

ఇదివరకు తనకి జరిగిన గౌరవం, తలుచుకుంటే ముత్యాలరావుకు వెళ్ళటం యిష్టం లేదు. అయితే అంతా మనసులోనే ఉంచుకొన్నాడు!

ఆ దినమే యిన్స్పెక్టరుగారి బంట్రోతు స్కూలుకు పనిగట్టుకువచ్చి అయ్యగారు తమను ఒకమారు కన్పించమన్నారని చెప్పి చీటీ తెచ్చి యిచ్చాడు. "మీతో ఒక విషయం మాట్లాడాలి. రావటానికి వీలులేకుండా ఉంది" సాయంత్రం ఒకమారు కన్పించండి." అదీ చీటీలో విషయం.

"అలాగే" అన్నాడు ముత్యాలరావు. అతడికి వెళ్ళటం సుతరామూ యిష్టంలేదు. ఇదివరలో ఆత్మాభిమానం లేకపోయినా, యిప్పుడది హైస్కూల్లో ఉద్యోగంలో ప్రవేశించింది. వెళ్ళగూడదనుకొని ఉండిపోయాడు.

కాని సాయంకాలం అవటంతోటే సత్యనారాయణ వచ్చి "రండి మాస్టారూ మా యింటికి వెడదాం" అన్నాడు.

ఇక ముత్యాలరావు రానన లేకపోయాడు. "సరే" అని బయలుదేరాడు. ఎందుకు పిలిచారో తానేవిధంగా మాటాడాలో ఊహించుకొంటూనే వాళ్ళయింటికి వెళ్ళాడు.

ఇన్స్పెక్టరు నాయుడుగారు యింటివద్దనే ఉన్నారు. ముత్యాలరావును దూరంనుంచి చూడటంతోటే "ఓహో మేస్టారూ దయచేయండి! చిరకాలదర్శనం" అంటూ కుర్చీలోంచి లేచి యెదురువచ్చాడు. తాను ప్రయివేటు చెప్పిన ఆ కాలంలో, యిటువంటి మర్యాద యెప్పుడూ లేదు. "ఇలా మర్యాదచేయటమేమిటూ" అని ముత్యాలరావు తికమకపడ్డాడు.

నాయుడుగారు ముత్యాలరావు "వద్దు వద్దం"టూంటే కాఫీ హోటలునించి రెండు కాఫీలు తెప్పించాడు. బలవంతాన ముత్యాలరావుచేత త్రాగించాడు. "మాట్లాడవలసిన విషయం ఏమీ లేదు. చిరకాల మిత్రులూ, అనుభవం సంపాదించుకొన్నవారూను, మీరు" అని యేమో అనసాగాడు.

ఇలా తన్ను పొగడటంలో ఏదో 'స్వార్థం' ఉండకమానదని ముత్యాలరావు నిశ్చయించుకొన్నాడు. ఇన్స్పెక్టరుగారు చెప్పుకుపోతున్నాడు.

"మా అబ్బాయికి ప్రథమగురువులు మీరు. హైస్కూలు విద్యకు అక్షరాభ్యాసనాంది మీరే చేశారు. చిన్నవారే అయినా మీ అనుభవం రిటరయిపోయే టీచరకయినా ఉండదంటే నమ్మండి. అందుకనే మిమ్మల్ని ..."

ముత్యాలరావు విషయం ఊహించాడు. "నాకు ప్రస్తుతం తీరిక లేదండీ!" అని అన్నాడతను.

"మీరే అలా అంటే, యెలా చెప్పండి! కష్టపడి చెప్పేవాళ్ళకు యెప్పుడూ సైముండదు. మీరు డబ్బుకోసం చదువు చెప్పరు. పేరు కోసం కష్టపడి చెబుతారు. మీకు కాలంతో నిమిత్తం లేదు."

"మరో విధంగా భావించకండి. ప్రస్తుతం చెప్పటం నాకు కష్టం."

"అలాగంటే వీల్లేదు. మీకు మనస్సులో బాధగా ఉండవచ్చు. గతాన్ని మరవండి. గాంధీమహాత్ముడే తప్పుచేసి సవరించుకొన్నాడు. చిన్నవాళ్ళం—మనమెంతటి వాళ్ళం. నా మాట విని ..."

ఈమారు ముత్యాలరావు మౌనంగా ఉరుకొన్నాడు.

ఇన్స్పెక్టరుగారు చెప్పుకుపోతున్నాడు.

"మీకు యేం జీతం కావలసివస్తే ఆ జీతం యిస్తా. మీరు మా కుర్రవాడికి ట్యూషను చెప్పటమే నే కోరేది!"

"కోరినదిస్తానని" అనటంతోటే ముత్యాలరావు, చెబుతాననటమా, చెప్పననటమా, అని ఆలోచనలోపడ్డాడు!

తిరిగి యిన్స్పెక్టరుగారు అనసాగారు: "ఇంతకీ మీతో యింత యిదిగా హృదయం యిచ్చి, మాట్లాడుతున్నందుకయినా ఒప్పుకోవాలి! అది అటుంచండి. మా కుర్రవాడు మీ తరగతిలో నుండటంవల్ల, తరగతి ఉపాధ్యాయులు మీరే గనకా, యింత యిదిగా చెబుతున్నా. నా మాట కాదనకండి."

చివరకు ముత్యాలరావు, "నా దగ్గర ఇప్పుడు ఒక అరడజను కుర్రాళ్ళున్నారు. వాళ్ళందరూ మా యింటికి వచ్చి చెప్పుకొంటున్నారు. మీ కిష్టమయితే మీ కుర్రవాణ్ణి గూడా పంపండి ఇంటికి" అన్నాడు.

ఇన్స్పెక్టరుగారు కొంచెం యోచించి "సరే, కానివ్వండి. మీయింటికే వస్తాడు." అన్నాడు.

"పిల్లలంతా పదిహేను రూపాయల చొప్పున యిస్తున్నారు." ముత్యాలరావు అన్నాడు. ఇది శుద్ధఅబద్ధం. తప్పించుకోటానికివేసిన పన్నాగం.

"అందరివద్దా ఏ విధంగా పుచ్చుకొంటే మాదగ్గరా అదేవిధంగా పుచ్చుకొనండి. సరా"

"కష్టపడి చెప్పటం వరకే నా బాధ్యత-"

"అదే మాకు కావలసింది! మీ వంటి ఉపాధ్యాయుల్ని యెన్నుకొన్నది గూడా అందుకే."

"మీ కుర్రవాడి చదువు సంధ్యలమీద—ఆధారపడి ఉంటుంది ఫలితం."

"అవును, కష్టపడి చదివితే ప్రయోజనం కన్పించుతుంది. చదవని పక్షంలో ప్రయోజనం కన్పించదు. అయితే కష్టపడి చదివిస్తారని తగిన ఫలితం కన్పిస్తుందనేగా మీ వద్దకు పంపటం!" ఇన్స్పెక్టరుగారి మాటల్లో శ్లేషార్థం, ఉచ్చు బిగింపు ఉన్నట్లు ముత్యాలరావు భావించుకొన్నాడు.

మనస్ఫూర్తిగా అతడికి ప్రయివేటు చెప్పడం యిష్టంలేదు. మరి యీ సమయంలో తన్ను నిర్బంధించుతున్నప్పుడు ఏదోవిధంగా తప్పించుకొనేటందుకు అనేక అడ్డంకులువేశాడు. అన్నీ అంగీకారంతో దాటుకొచ్చాడు యిన్స్పెక్టరుగారు.

"నా శక్తి నుపయోగించి చదువు చెబుతాను. మిగిలినది మీ అదృష్టం" అన్నాడు ముత్యాలరావు.

నాయుడుగారు దానికి అంగీకరించారు.

ఒకానొకప్పుడు తన్ను హేళన చేసిన యిన్స్పెక్టరు నాయుడుగారు, తన్ను యీ దినం బ్రతిమాలవలసి వచ్చింది. ముత్యాలరావుకు స్వతహాగా చెప్పటం యిష్టం లేకపోయినా, ప్రయివేటు చెప్పటానికి ఒప్పుకొనటం తప్పనిసరైంది. ప్రతి నెలా చెల్లించిన పదిహేను రూపాయల మహత్యమో, లేక ముత్యాలరావు ప్రయివేటు ఫలితమో, కుర్రవాడి తెలివితేటల ఫలితమో, మరేమోగాని ఆ ఏడు సత్యనారాయణ మాత్రం కృతార్థుడయ్యాడు.

ఇప్పుడు సత్యనారాయణ మూడో ఫారంలోకి వచ్చాడు. ఇదివరకు చెప్పిన విధంగానే ముత్యాలరావు చెబుతూన్నప్పటికీ, చెప్పేశక్తి అతడిలో ఉన్నప్పటికీ, నాయుడుగారుమాత్రం సత్యనారాయణను వాళ్ళ క్లాసు టీచరువద్ద ప్రయివేటుకు చేర్పించాడు.